క్లుప్తంగా

బీసీలకు అవకాశం ఇవ్వాలి

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్ పదవుల్లో బీసీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీల్లోనూ ముఖ్యంగా కులవృత్తులకు సంబంధించిన నాయీ బ్రాహ్మణ, చాకలి, కుమ్మరి కులాల వారు ఎంతో వెనకబడి ఉన్నారని వాపోయారు. అలాంటి కులాలకు చెందిన వారిలో కొందరికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. అలాంటప్పుటే రాజకీయంగా వారు కూడా ముందుకు వస్తారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయం పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచే విధంగా బోధన సాగించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ కమిటీ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలని సూచించారు. పనులు పూర్తైన అమ్మ ఆదర్శ కమిటీ అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదనే విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా పంట వివరాల నమోదు



అమరచింత: రైతులు వానాకాలంలో సాగు చేసిన పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఏఈఓలు పొలంబాట పడుతున్నారని.. వారికి సహకరించాలని ఏడీఏ దామోదర్ కోరారు. మంగళవారం మండలంలోని మిట్టనందిమళ్లలో పంట వివరాల నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వానాకాలం సాగు వివరాలు సేకరిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏఓలు, ఏఈఓలు తమ స్మార్ట్‌ఫోన్లలో అప్‌లోడ్ చేసిన ప్రత్యేక యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. పంట వివరాల నమోదుతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరతాయని.. తమ పంటను ఎక్కడైనా విక్రయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈసారి రైతులు అధికంగా కంది, ఆముదం, పత్తి, వరి, చెరుకు సాగుచేస్తున్నారని వెల్లడించారు. ఆయన వెంట ఏఈఓ మల్లేష్, రైతులు ఉన్నారు.

'రైతునేస్తం' సద్వినియోగం చేసుకోవాలి



పాన్‌గల్: ప్రతి వారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, యాజమాన్య పద్ధతులు, వరిలో స్వల్ప కాలిక రకాలు, ఎరువుల వాడకం గురించి పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. ఎరువులు, విత్తనాలు ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాలలో అధికారుల సూచనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సాజీద్ రహమాన్, పాన్‌గల్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల ఏఈఓలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానీయం

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ నాగరాజు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో తాగునీటి సరఫరా అయ్యే పైపులైన్ పాడవడంతో లీకేజీలను గుర్తించి కొత్త పైపులైన్ వేయించారు. చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ చెన్నయ్య పనులను పర్యవేక్షించారు.



బిల్లుల చెల్లింపులో జాప్యం



దావాజిపల్లి యూపీఎస్‌లో పనులు పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్ తేజస్ పవార్ (ఫైల్)

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తయినా అందని బిల్లులు
- 25 శాతం మందస్తు చెల్లింపులకే పరిమితం
- పూర్తికాని పనులపై అధికారుల సమీక్ష
- పనుల పూర్తికి ఈ నెల 15వ తేదీ డెడ్‌లైన్



కదిరెపాడు పీఎస్‌లో నీటి కొళాయిల ఏర్పాటు

పాన్‌గల్: విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు ఆసక్తి చూపడానికి అనుగుణంగా ఏటా రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన విద్యతో పాటు కనీస వసతుల కల్పనకు కృషి చేస్తోంది. దీనికోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాల పథకాన్ని తీసుకొచ్చింది. ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి తాగునీరు, విద్యుత్, మూత్రశాలల మరమ్మతు తదితర పనులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. వీటిని క్షేత్రస్థాయిలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు అప్పగించి పనులు పూర్తి చేశారు. కానీ బిల్లులు చెల్లించకపోవడంతో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తి చేసిన పనుల్లో ఇప్పటి వరకు కేవలం 25 శాతం బిల్లులు మాత్రమే చెల్లించారు. పనులు పూర్తి చేశాం బిల్లులు చెల్లించండి అని అధికారులను అడిగితే ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారని కమిటీ సభ్యులు వాపోతున్నారు. పనులు పూర్తికానీ పాఠశాలలో ఈనెల 15వ తేదీ వరకు పూర్తి చేసేలా కలెక్టర్ డెడ్‌లైన్ విధించడంతో అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

మండల పరిస్థితి ఇలా..

మండలంలో 28 పాఠశాలలు ఎంపిక కాగా వాటిలో 25 పాఠశాలల్లో పనులు పూర్తి చేయగా.. మిగిలిన మూడు పాఠశాలలు అన్నారంతండా, శాగాపూర్‌తండా పీఎస్, శాగాపూర్ ఉన్నత పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి.

పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాలలు	
	ఎంపిక చేసిన	పనులు పూర్తయినవి
పాన్‌గల్	28	25
చిన్నంబావి	17	14
వీపనగండ్ల	18	16

బిల్లులు మంజూరు చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేస్తే బిల్లులు త్వరగా వస్తాయని అధికారులు సూచించారు. కానీ పనులు పూర్తి చేసిన బిల్లులు రావడంలేదు. అధికారులు స్పందించి బిల్లులు త్వరగా మంజూరు చేయాలి. 25 శాతం నిధులు ఏమాత్రం సరిపోకపోవడంతో అప్పులు చేసి పనులు చేసిన మిగతా బిల్లులు చెల్లింపులో జాప్యం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలి.

– చిట్టెమ్మ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, తెల్లరాళ్లపల్లితండా

అప్పులు చేశాం



అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు పూర్తి చేసినా బిల్లులు సకాలంలో రావట్లేదు. అప్పులు చేసి పనులు పూర్తి చేశాం. కానీ ప్రభుత్వం నిధులు మంజూరులో జాప్యం చేస్తుండడంతో వడ్డీలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం.

– లక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు, వెంగళాయిపల్లి

జిల్లా అధికారులకు నివేదిస్తాం



అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులకు సంబంధించిన బిల్లుల ఆలస్యం అవుతున్న విషయాన్ని మరోమారు జిల్లా అధికారులకు నివేదిస్తాం. పనులు పూర్తి చేసిన వాటికి బిల్లులు అందేలా తగు చర్యలు తీసుకుంటాం. ఇంకా నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయిస్తాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

అంగన్‌వాడీల్లో కందిపప్పు కొరత



అమరచింతలోని అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులతో సీడీపీఓ, సూపర్‌వైజర్ (ఫైల్)

జిల్లా అధికారులకు నివేదించాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పు నిల్వలు లేవనే విషయాన్ని సదరు కాంట్రాక్టర్‌కు వివరించాం. ఇప్పటికే మదనాపురం, తిప్పడంపల్లి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా చేశారు. కాంట్రాక్టర్ అలసత్వం పై జిల్లా అధికారులకు పరిస్థితి విన్నవించాం.

– భారతి, సీడీపీఓ ఆత్మకూర్

అమరచింత: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరైన సమయానికి సరఫరా కాకపోవడంతో వారం రోజుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం తయారీ నిలిచింది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కిచిడి తయారు చేసి అందిస్తున్న పరిస్థితులు దాపరించిన సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు ఆత్మకూర్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం కందిపప్పు నిల్వలు లేకపోవడంతో గర్భిణి, ప్రసూతి మహిళలకు భోజనాన్ని అందించ లేకపోతున్నారు. మొత్తంగా ఇరు మండలాల్లో 47 అంగన్‌వాడీల పరిస్థితి ఇదే విధంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. అంగన్‌వాడీలకు సరుకులు అందించే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇలాంటి సమస్యలను రెండు నెలలకు ఓ పర్యాయం పునరావృత్తం అవుతుందని లబ్ధిదారులు తెలిపారు.

బాలికల పాఠశాలపై అలసత్వం తగదు



పాఠశాలలో వరండా పై కప్పును పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తరగతి గదులపై కప్పులు పెచ్చులూడుతున్న సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆకస్మికంగా సందర్శించి పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లుగా పాఠశాల వరండా పైకప్పులతో పాటు తరగతి గదుల పైకప్పులు పెచ్చులూడి పడుతున్నాయని తెలిపారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని, వాటిని తొలగించకపోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయన్నారు. మన ఊరు–మన బడి ద్వారా అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం వెంటనే నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మరుగుదొడ్ల శుభ్రత కోసం మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య సిబ్బందిని పాఠశాలకు పంపాల్సిన అవసరం ఉందన్నారు. బాలికల పాఠశాల సమస్యలను పరిష్కరించకపోతే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివ, రాము, చరణ్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు విడుదల చేయాలి



బిల్లులను చూపిస్తున్న నాయీ బ్రాహ్మణులు

పెబ్బేరు రూరల్: క్షవరశాలలు, దోబీ ఘాట్లకు ప్రభుత్వం చెల్లించే విద్యుత్ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని నాయీ బ్రాహ్మణుల సంఘం మండల నాయకుడు బాలకృష్ణ కోరారు. పట్టణ కేంద్రంలో మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2021 సంవత్సరంలో క్షవరశాలలు, ఇస్త్రీ షాపులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేశారని గుర్తు చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ కార్పొరేషన్ ద్వారా 7 నెలల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ బిల్లులు కట్టాలని వేధిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకానికి ఆటంకాలు లేకుండా క్షవరశాలలకు విద్యుత్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సత్యం, శంకర్, ఎల్లస్వామి, గోపాలకృష్ణ, బాల్‌రాజు, సురేష్, శాంతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ బోనాలు



కొత్తపల్లిలో బోనాలతో మహిళలు



అమరచింతలో..

మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం పెద్దమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మంగళవారం సాయంత్రం ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

నాగల్‌కడ్మూర్‌లో..

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో మంగళవారం పోచమ్మ దేవత బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామ ప్రజలు పొలిమేరలో ఉన్న పోచమ్మ ఆలయానికి వచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలోని పోచమ్మ దేవత విగ్రహాన్ని పవిత్ర కృష్ణానది జలాలతో అభిషేకించారు. సాయంత్రం అమ్మవారికి బోనాలతో ప్రజలందరూ డోళ్ల చప్పులతో ఊరేగింపుగా వచ్చి పోటేళ్లను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. సకాలంలో వానలు కురిసి పంట పొలాలు ధాన్యరాశులతో నిండాలని మొక్కుకున్నారు.

23న బోనాల పండుగ

పట్టణంలో ఈనెల 23న పోచమ్మదేవత బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. పోచమ్మ ఆలయంలో మంగళవారం ఉత్సవ కమిటీ, నిర్వహణ కమిటీ సభ్యులు కలిసి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడంలో బోనాల పండుగను నిర్వహిస్తున్నామని, ప్రజలు ఆలయ కమిటీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, తాటికొండ రమేష్, కృష్ణయ్య, చిన్న బుచ్చన్న, మదుగాని శివన్న, బాయికాడి రాజు, కంకలి రవి, జింక రవి పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు దాబ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, రుణమాఫీ వెంటనే అమలు చేయాలంటూ మంగళవారం బీజేపీ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన రూ.2లక్షల రుణ మాఫీ, పెట్టుబడిసాయం రూ.15వేలు, కౌలురైతుకు రూ.15వేలు, అదేవిధంగా వ్యవసాయ కూలీలకు రూ.12వేలు హామీలను వెంటనే అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో భరత్‌భూషణ్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేంద్రగౌడ్, ఆర్మీ బాలస్వామి, సిటీ కేబుల్ బాలు తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచరులు, విద్యార్థులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన ఉపాధ్యాయులు చైతన్యకుమార్, వెంకట్రాముడు, అనురాధ, రాజేష్‌బాబు, ఎల్లయ్య , జ్యోతినయానంద, జిక్కి రవి, విజేయుడు, కృష్ణవేణి, నిరంజన్, నింజన్‌గౌడ్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, ప్రజలు మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజయమ్మ పాల్గొన్నారు.

దేశ భద్రతలో ప్రతి విద్యార్థి భాగస్వాములు కావాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు

సాక్షి, నెట్‌వర్క్: దేశ కోసం ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని ఏబీవీపీ జిల్లా పూర్వ కన్వీనర్ అజయ్‌కుమార్, జిల్లా నాయకుడు అఖిల్ అన్నారు. ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ జిల్లా కన్వీనర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ 1949 జూలై 9న ఏబీవీపీ అనే విద్యార్థి సంఘాన్ని ఓంప్రకాష్ బేహాల్ స్థాపించారన్నారు. అప్పట్లో ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు ప్రపంచ దేశాల్లో కొన్ని లక్షల మంది విద్యార్థులతో అతి పెద్ద జాతీయ విద్యార్థి సంఘంగా కొనసాగుతుందన్నారు. ఏబీవీపీ జ్ఞానం, శీలం, ఏకత అనే మూడు సిద్ధాంతాల కోసం పనిచేస్తుందని తెలిపారు. ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై నిరంతం పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం నారక్తం నాతెలంగాణ, హరిత తెలంగాణ పేరు మీద ఒకే రోజు కోటి మొక్కలు నాటినట్లు గుర్తు చేశారు. ఏబీవీపీ ఆందోళన కార్యక్రమాలే కాదు సేవా, నిర్మాణాత్మకమైనటువంటి కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులను దేశ భక్తి వైపు నడిపిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, నరేంద్ర, మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, యాంకి లింగన్న, వెంకటేష్, బాలు, రాజేష్, వంశీ, సందీప్, విగ్నేష్, నానిగౌడ్ ఉన్నారు.

విభిన్న కథనాలకే విలువెక్కువ

వనపర్తిటౌన్: సోషల్ మీడియా విప్లవాన్ని ఢీకొట్టేందుకు పాత్రికేయులు విభిన్న కథనాలను సరికొత్త ఒరవడితో ప్రచురిస్తేనే పాత్రికేయ రంగానికి విలువ పెరుగుతుందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మధుగౌడ్‌కు జిల్లా కమిటీ తరుపున సన్మాన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. పుస్తక పఠనానికి ప్రస్తుత సాంకేతిక విప్లవంతో ఆదరణ తగ్గుతున్నా భవిష్యత్‌లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. పాత్రికేయులు ప్రజలతో మమేకం కావాలని, అప్పుడే వాదనలకు బలం చేకూర్చే కథనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎల్లగౌడ్, ఉశన్న, పార్థిరెడ్డి, ప్రశాంత్, మాధవ్, శ్రీనివాసరావు, రమేష్, లక్ష్మణ్, ఆంజనేయులు, ప్రకాశ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని దేవరపల్లికి చెందిన వినోద్ గతేడాది ఆగస్టు 10వ తేదీన ఆత్మకూర్‌కు బైక్‌పై వస్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ కనుక్కొని రికవరీ చేసి అప్పగించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయినా లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

యువకుడిపై కేసు

అమరచింత: పట్టణానికి చెందిన అమ్మాయిని పెద్దమందడి మండలంలోని తండాకు చెందిన సంతోష్ అనే యువకుడు వేధింపులకు గురిచేయడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. కొంత కాలంగా పట్టణానికి చెందిన అమ్మాయిని సంతోష్‌తో పాటు అతడి తల్లి ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

ఆత్మకూర్: ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా కొకుంట్ల బాలీశ్వర్‌గుప్త ఎన్నికయ్యారు. మంగళవారం కన్యాకపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు సమావేశమయ్యారు. రానున్న దసరా నవరాత్రుల సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలీశ్వర్‌గుప్తాను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. బాలీశ్వర్‌ను పలువురు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

పెబ్బేరు రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఏఎస్‌ఐ వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీరంగాపురం మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. అతడిని వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించగా.. మంగళవారం రిమాండ్ పంపించామని ఎస్‌ఐ తెలిపారు.

అటెండర్ మృతి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పనిచేసే అటెండర్ అనారోగ్యంతో మరణించాడు. సహ ఉద్యోగులు తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పేట మండల కేంద్రంలోని పశువైద్యశాలలో కల్వకుర్తి మండలం అజ్జకోలు గ్రామానికి చెందిన రాము(32) సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా అతడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 1 నుంచి సెలవుపై వెళ్లి నిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. ఈ సందర్భంగా సహోద్యోగులు సంతాపం ప్రకటించారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

వనపర్తిటౌన్: మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌గౌడ్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, లక్కాకుల సతీష్, ఎస్‌ఎల్‌ఎన్ రమేష్, అంగడి నరేందర్, చంద్రపాల్‌రెడ్డి, రాంరెడ్డి, గోనూరు రాజు, నరేందర్ గౌడ్, వినోద్ గౌడ్, రవి యాదవ్, ఖాజా బాబా తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌గౌడ్‌కు వనపర్తి జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భగవంతుగౌడ్, సంగమేశ్వర్‌గౌడ్, పార్థసారథిగౌడ్, జయరాములుగౌడ్, నరేందర్‌గౌడ్, పురుషోత్తంగౌడ్, చరణ్‌గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, జయచంద్రగౌడ్, నాగేంద్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నియంత్రణకు చికిత్స తప్పనిసరి

పాన్‌గల్: టీబీ వ్యాధికి వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అన్నారం, అన్నారంతండా, దావాజిపల్లి గ్రామాల్లో టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించి అనుమానితుల నుంచి తెమడ (కళ్లె) సేకరించారు. 2 వారాలకు మించి దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం, ఛాతీ ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వ్యాధి సోకిన వారు బయట తిరగరాదని, ఉమ్మరాదన్నారు. వ్యాధి జుట్టు, గోళ్లు మినహా అన్ని అవయవాలకు వ్యాపించే అవకాశం ఉందని, ఎక్కువగా ఊపిరితిత్తులు, పేగులు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, వెన్నెముకకు సోకుతుందని తెలిపారు. వ్యాధి సోకిన వారు వైద్యుల సూచనల మేరకు 6 నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వ్యాధి సోకిన వారికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా పోషకాహారం తీసుకునేందుకు ప్రతి నెల రూ.500 చెల్లిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద కాల్వల్లో సిల్ట్ తొలగించాలి



వనపర్తిటౌన్: వరద కాల్వల్లో పేరుకుపోయిన షిల్ట్‌ను తక్షణమే తొలగించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ డిమాండ్ చేశారు. వర్షాకాలం కావడంతో వరద నీటి కాల్వల్లో పూడిక తీయకపోతే వరద నీరు రహదారులపై పారడంతో పాటుగా పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం 30వ వార్డులో మున్సిపల్ జేసీబీ సాయంతో వరద కాలువ షిల్ట్ తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా వరద కాల్వలతో జరిగే ప్రమాదాన్ని అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ పాలక వర్గం విఫలమైందని ఆరోపించారు. వర్షాకాలంలో ఏపుగా పెరిగిన కంప చెట్లు, ముళ్ల పొదలు తొలగించి వరద నీరు బయటకు ప్రవహించకుండా అధికారులైన చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు చేపట్టాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరువ చూపాలని సూచించారు.

ఐఐటీ విద్యార్థికి చేయూత



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని బండరావిపాకులకు చెందిన జలగం భద్రయ్య కుమారుడు జలగం సాయిరుషిత్ ఇటీవల ఐఐటీ, కాన్పూర్‌లో సీటు సాధించాడు. విద్యార్థి ఆర్థిక పరిస్థితిని స్థానిక నాయకులు పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తూడి శ్రీనివాస్‌రెడ్డికి వివరించారు. స్పందించిన ఆయన విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందించారు.